మట్టి వినాయక విగ్రహాలకు మంచి డిమాండ్

- అందుబాటులో 3 నుంచి 6 అడుగుల మట్టి విగ్రహాలు
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు తగ్గిన డిమాండ్

భీమవరం(ప్రకాశం చౌక్): పర్యావరణం బాగుండాలనే ఆలోచన ప్రజలల్లో క్రమేపి పెరుగుతోంది. దీనికి అనుగుణంగా వినాయక చవితి రోజున పూజించడానికి కేవలం మట్టి విగ్రహాలనే కొనుగోలు చేసే వారికి సంఖ్య పెరుగుతోంది. వినాయక చవితికి ప్రతి వీధిలో చవితి మహోత్సవాలు నిర్వహిస్తారు. 3 నుంచి 11 రోజుల పాటు వినాయక మండపాలు పెట్టి మరీ స్వామి వారిని పూజిస్తూ ఉంటారు. అయితే గత కొన్నేళ్లుగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలే మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి. ప్రజల ఆలోచనా విధానం మారడంతో ప్రస్తుతం మట్టి విగ్రహాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి.

70 శాతం మేర మట్టి విగ్రహాలు

పర్యావరణ కాలుష్యంపై ప్రభుత్వం దృష్టిపెట్టి అధికారుల ద్వారా ముఖ్యంగా పోలీసు వ్యవస్థ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడంతో గత మూడేళ్లుగా మట్టి వినాయకుని విగ్రహాలను పూజించడం ప్రారంభించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు మట్టి విగ్రహాలే శ్రేయస్సు అనే ఆలోచన ప్రజల్లో రావడంతో దాదాపు 70 శాతం మేర మట్టి వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దాంతో మట్టి వినాయకుని విగ్రహాలకు మంచి డిమాండ్ వచ్చింది. మార్కెట్‌లో అధికంగా మట్టి వినాయకుని విగ్రహాలు అందుబాటులో ఉంటున్నాయి. 30 శాతం మేర ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు ఉపయోగిస్తున్నారు. అయితే అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి పూర్తిగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారు చేయకుండా చర్యలు తీసుకుంటే జల కాలుష్యాన్ని కొంత వరకు నివారించవచ్చని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.



భీమవరంలో విక్రయిస్తున్న మట్టి వినాయక విగ్రహాలు

రూ.6 వేల నుంచి రూ.16 వేలు

మట్టి వినాయకుని విగ్రహాలు గరిష్టంగా ఆరు అడుగుల వరకే చేసే వీలు ఉంటుందని తయారీదారులు చెబుతున్నారు. ఈ మట్టి వినాయకుని విగ్రహాలు సైజును బట్టి రూ 6 వేలు నుంచి రూ 16 వేలు వరకు అమ్ముతున్నారు. అయితే విగ్రహాలను తయారు చేస్తున్న ప్రాంతం నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి భీమవరం వంటి ప్రాంతాల్లో అమ్మడంతో మట్టి విగ్రహాల ధర పెరుగుతుంది. ఇక ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల ధర రూ.7 వేలు నుంచి రూ.30 వేల వరకు ఉన్నాయి.

జిల్లాలో అనేక ప్రాంతాల్లో విగ్రహాల అమ్మకం

జిల్లాలో భీమవరం, అత్తిలి, పాలకొల్లు, నరసాపురం, ఉండి, ఆకివీడు, వీరవాసరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట తదితర ప్రాంతాల్లో విగ్రహాలు తయారు చేసి అమ్ముతుంటే, కొన్ని ప్రాంతాల్లో విజయనగరం, విశాఖ, యానాం, కొత్తపేట ప్రాంతాల నుంచి విగ్రహాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. జిల్లాలో ఏటా సుమారు 10 వేలు నుంచి 15 వేల విగ్రహాల అమ్మకాలు జరుగుతున్నాయి. గతేడాది పలు రాజకీయ పార్టీల నాయకులు ఆయా ప్రాంతాల్లో ఉచితంగా వినాయకుని విగ్రహాలు ఇవ్వడంతో విగ్రహాలను తీసుకువచ్చి ప్రధాన పట్టణాల్లో అమ్మకాలు చేసే చిరు వ్యాపారులు నష్టపోయారు.



మట్టితో అద్భుతంగా తయారు చేసిన వినాయక విగ్రహం

మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేస్తున్నాం



మా గ్రామంలో ప్రతి ఏడాదీ చవితి ఉత్సవాల్లో మట్టి వినాయకుని ఏర్పాటు చేస్తూ ఉంటాం. ఈ ఏడాది కూడా మట్టి విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. మట్టి విగ్రహం వల్ల పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. ఉత్సవ మండపాల నిర్వాహకులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వల్ల కలిగే ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేయాలి.

– గూడూరి గోపి, శ్రీ విజయ గణపతి యూత్ కమిటీ సభ్యుడు, కొండేపూడి

మట్టి విగ్రహాలకే డిమాండ్



నేను గత పదేళ్లుగా ప్రతి ఏడాదీ భీమవరంలో వినాయకుని విగ్రహాలను అమ్ముతున్నాను. మొదట్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు దాదాపు 90 శాతం అమ్మకాలు జరిగేవి. అయితే ప్రజల్లో కాలుష్యంపై అవగహన రావడంతో క్రమేపి మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మధ్య కాలంలో 60 నుంచి 70 శాతం మంది మట్టి విగ్రహాల ను కొనుగోలు చేస్తున్నారు.

– అనపర్తి సురేష్, విగ్రహాల వ్యాపారి, భీమవరం

క్లుప్తంగా

నంది అవార్డు గ్రహీత మణికంఠకు సత్కారం



మణికంఠను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఇటీవలే నంది అవార్డు పొందిన పట్టణానికి చెందిన పురోహితులు కాశీభట్ల మణికంఠను మెంటేవారి తోటలోని బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారి దేవస్థానంలో సత్కరించారు. పౌరోహిత్యంలో నంది అవార్డు సాధించడం గొప్ప విశేషమని, ఇలాంటి అవార్డులు మరెన్నో సాధించాలని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో కొమ్ము శ్రీనివాస్, మద్దాల సత్యనారాయణ, చినిమిల్లి ఆదినారాయణ, లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ సునీల్ కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

కాళ్ల: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంచాలని ఆశ వర్కర్ల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం ఆశ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఆశ వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీఓలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అదనపు పనుల వల్ల ఆశ కార్యకర్తలులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక గంట పర్మిషన్ కావాలన్నా, ఒకరోజు సెలవు కావాలంటే అధికారుల దయపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.. సమస్యల పరిష్కారానికి జిల్లాల్లో జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు సునీల్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

భీమవరం అర్బన్: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ హాస్పటల్‌లో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీల జీవోలను వెంటనే విడుదల చేయాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు విమల కుమారి, ఏఎన్‌ఎమ్ రత్నకుమారి, ఎంవీ సుందరి, పి. ఉషా కుమారి, బి చిట్టిమేరి, టి. గౌరి తదితరులు పాల్గొన్నారు.

పాందువ్వలో హుండీ చోరీ

ఉండి: పాందువ్వ బీసీ కాలనీలోని వరసిద్ధి వినాయకుడి గుడిలో సోమవారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా వినాయక చవితి పండుగ ముగిసిన రోజు నుంచి తర్వాత ఏడాది వినాయక చవితి పండుగ వరకు హుండీ తెరవమని, దీంతో ఏడాది కాలంగా హుండీ ఆదాయం లెక్కించలేదని తెలిపారు. హుండీలో సుమారుగా రూ.1.20 లక్షల నుండి రూ.1.50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు వారు తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారమిస్తాని నిర్వాహకులు తెలిపారు.అయితే ఈ చోరీపై పోలీసులను ఆరా తీయగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నసీరుల్లా తెలిపారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: ప్రైవేట్ బస్సు మోటర్ ఢీకొట్టడంతో మంగళవారం ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరవాసరం వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు శృంగవృక్షం గ్రామానికి వచ్చేసరికి మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దాంతో మోటార్ బైక్ పై ప్రయాణిస్తున్న వీరవాసరం మండలం తోకలపూడి గ్రామానికి చెందిన బొబ్బనపల్లి శ్రీహరి, పోతురాజులకు గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం భీమవరం ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ హరిబాబు తెలిపారు.

22 నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

నరసాపురం: పట్టణంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు చెప్పారు. మంగళవారం కమిటీ సమావేశాల నేపథ్యంలో పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటి సమావేశాలు మొదటిసారిగా నరసాపురంలో జరుగుతున్నాయన్నారు. గతం నుంచి నరసాపురం సీపీఎంకు మంచి పట్టున్న ప్రాంతమన్నారు. ఈ సమావేశాలకు పార్టీ రాష్ట్ర నాయకులతో పాటు కేంద్ర కమిటీ నాయకులు కూడా హాజరవుతున్నారని చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలోని ఓ పాత రైస్‌మిల్లు వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.2650 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్రపుడెక్క పరిశీలన

ఆకివీడు: ఉప్పుటేరు ప్రక్షాళనకు భారీ బడ్జెట్ అవసరం అవుతుందని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని ఉప్పుటేరుపై ఉన్న రైల్వే వంతెన ప్రాంతంలో పేరుకు పోయిన గుర్రపుడెక్కను మంగళవారం ఆయన పరిశీలించారు. గుర్రపుడెక్క, కిక్కిస పేరుకు పోవడం వల్ల నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా ఉందని రైతులు, దుంపగడప గ్రామస్తులు తెలిపారు. నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న ప్రాంతాల్ని తొలగించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని డ్రెయిన్స్ ఏఈ వెంకటేశ్వర రావును ఆదేశించారు.

దుంపగడపలో రక్తపరీక్షలు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న, ఇతర వ్యాధులకు గురైన వ్యక్తుల నుండి రక్త సేకరణను మంగళవారం చేపట్టారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పాథాలజిస్ట్ డాక్టర్ శృతి ఆధ్వర్యంలో రక్తం సేకరించారు. గ్రామంలో జ్వరం వచ్చిన వారికి, ఇతర వింత వ్యాధులు వచ్చిన వారు సుమారు 26 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి తాడేపలి గూడెం తీసుకు వెళ్లుతున్నట్లు డాక్టర్ శృతి చెప్పారు పరీక్ష ఫలితాలు నాలుగు రోజుల్లో వస్తాయన్నారు. కార్యక్రమంలో పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యులు రాజశేఖర్, సీహెచ్‌సీ వైద్యురాలు భువన తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

భీమవరం: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయమూర్తి రూ. 10 వేలు జరిమానా విధించారని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం .నాగరాజు మంగళవారం చెప్పారు. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం గత నెల 31వ తేది రాత్రి వన్‌టౌన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా భీమవరం మండలం యనమదుర్రు గ్రామనికి చెందిన జోగి నవీన్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా డ్రంక్ డ్రైవ్ టెస్ట్‌చేశారు. దీనితో నవీన్ మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో నిందితుడిని భీమవరం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం వీఎస్ రాజరావు వద్ద హాజరుపరచారు. నవీన్‌కు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అదనపు కట్నం వేధింపులతో భర్తపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. అనాకోడేరు గ్రామానికి చెందిన ఇళ్ల లక్ష్మికి, ఇళ్ల సత్యనారాయణతో 2018లో వివాహమైంది. వివాహ సమయంలో ఇళ్ల లక్ష్మీ తల్లిదండ్రులు రూ. 3 లక్షలు, కాసు బంగారం, ఆడపడుచుల లాంచనాల కింద రూ. 50 వేలు ఇచ్చారు. కొంతకాలం వివాహ బంధం సాఫీగా జరగగా ఇటీవల మీ పుట్టింటోళ్లని మోటార్ సైకిల్ కొనమని, డబ్బులు తీసుకురమ్మని భార్య లక్ష్మిని వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

వినియోగదారుల హక్కులకు విక్యాన్ తోడ్పాటు

భీమవరం: వలంటరీ కన్స్యూమర్ అసిస్టెన్స్ నెట్‌వర్క్ (విక్యాన్) వినియోగదారుల హక్కులను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఇటీవల జిల్లా వినియోగదారుల కమిషన్ నుంచి 5 కేసుల్లో విజయవంతమైన తీర్పులు అందించామని విక్యాన్ అధ్యక్షుడు బొమ్మిడి సన్నీరాజ్ చెప్పారు. మంగళవారం భీమవరం విక్యాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని వినియోగదారుడు స్థానిక షాప్‌లో కూల్‌డ్రింక్ కొనుగోలుచేయగా దానిలో గుర్తు తెలియని మలినాలు కనిపించాయని దీనిపై షాప్ యాజమాన్యాన్ని రూ. 12 వేలు పరిహారం చెల్లించాలని, పోస్టల్ డెలివరి సమయంలో డ్యామేజ్ కావడంతో ఫిర్యాదు దాఖలు చేయడంతో పోస్టల్ శాఖ రూ. 2 వేలు పరిహారం, అలాగే చెప్పుల షాపులో సరైన జీఎస్టీ బిల్లు ఇవ్వకపోవడంతో షాప్ యజమానికి రూ. 10 వేలు జరిమానా, రావులపాలెంలోని సినిమా థియేటర్ వద్ద వాటర్ బాటిల్ ఎక్కువ ధరకు విక్రయించడంపై ఫిర్యాదు దాఖలు చేయడంతో రూ. 5 వేలు పరిహారం బాధితుడికి ఇవ్వాలని ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. వినియోగదారులు ఏవైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ఏలూరుకు వెళ్లాల్సిన అవసరం లేదని భీమవరం నుంచే విక్యాన్ ద్వారా ఫిర్యాదులు దాఖలు చేసుకోవచ్చునని తమ సంస్థ ఉచిత సేవలందిస్తుందని సన్నీరాజ్ చెప్పారు. ప్రజల వద్దకే న్యాయం అన్న సంకల్పంతో వలంటరీ కన్స్యూమర్ అసిస్టెన్స్ నెట్‌వర్క్ పని చేస్తుందన్నారు. సమావేశంలో విక్యాన్ ఉపాధ్యక్షుడు ఎస్‌వై రాజు, కోశాధికారి ఆకుల తేజ, కార్యదర్శి ఓసూరి కుసుమరత్నం, సంయుక్త కార్యదర్శి నెలపాటి బాలుమనోహర్, న్యాయ సలహాదారు కంజిత లక్ష్మి, సమన్వయకర్త టీవీడీ శశిధర్, కార్యనిర్వాహక సభ్యులు జీవీ సుబ్బరాజు, వేంద్ర నవీన్, కె రాహుల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్యాన్ నాయకులు

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి

భీమవరం: ప్రకృతి ప్రసాదించిన నదీజలాలు, నీటి వనరులు కాలుష్యం బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని దీనిలో భాగంగా వినాయక చవితికి వినాయక మట్టి ప్రతిమలను పూజించాలని భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ అన్నారు. వినాయక ఉత్సవాల్లో గణేష్ మట్టి ప్రతిమలను పూజించి జల కాలుష్యాన్ని నిర్మూలిద్దామంటూ విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాల ఉపయోగాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, జిల్లా స్వదేశీ జాగరణమంచ్ కన్వీనర్ వేమిరెడ్డి హరికృష్ణ, మానవతా సంస్థ కో-చైర్మన్ కార్మూరి నర్సింహమూర్తి, అల్లు శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.మావుళ్ల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వినాయక మట్టి ప్రతిమలు అందిస్తున్న సీఐ కాళీచరణ్

పూర్ణచంద్రరావు మృతి పార్టీకి తీరని లోటు

భీమవరం అర్బన్: మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రేవు పూర్ణచంద్రరావు (69) మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గత 15 రోజులుగా రేవు పూర్ణచంద్రరావు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం మృతి చెందారు. మండలంలోని దొంగపిండి గ్రామంలో రేవు పూర్ణచంద్రరావు భౌతిక కాయానికి రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పూర్ణచంద్రరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించిన వారిలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తిరుమాని గంగా భవాని, ఎల్‌జీపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ మాజీ చైర్మన్ రేవు రాంబాబు, అగ్ని వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, సర్పంచ్‌లు బొడ్డు రేవతి, చిల్లే వెంకటేష్, తిరుమాని బాలచంద్రరావు, నాగిడి ముత్యాలరావు, తిరుమాని ధనంజయ, బొడ్డు మోహన్, పెనుమాల నరసింహస్వామి, రేవు బాలకృష్ణ, నాగిడి తాతయ్య తదితరులు ఉన్నారు.



పూర్ణచంద్రరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

విద్యాసంస్థల దాతృత్వం అభినందనీయం

భీమవరం (ప్రకాశంచౌక్): వరద సహాయంలో విద్యాసంస్థల దాతృత్వం మరువలేదని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, భీమవరం ప్రాన్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంద్ ఇన్ లో విజయవాడ వరద బాధితులకు తయారు చేయిస్తున్న వంట పదార్థాలను జేసీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అందరూ చేయిచేయి కలిపితేనే వరద పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించుకోగలుగుతామన్నారు. భీమవరం ప్రాన్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ 6 వేలు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం 2,500 ఆహార పొట్లాలను తయారు చేయించి విజయవాడకు పంపించారని తెలిపారు.

కాళ్లలో..

కాళ్ల: వరదల్లో చిక్కుకుని ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న బాధితులకు దాతలు సహకారమందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కాళ్ల ఇన్‌చార్జి తహసీల్దార్ ఈ.నాగార్జున అన్నారు. మండలనికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గాదిరాజు సుబ్బరాజు వరద బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన సుమారు 8 వేల ఆహర పొట్లాలను మంగళవారం ప్రత్యేక వ్యాన్ లో విజయవాడకు పంపించారు. భారీ వర్షాలకు వరదల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకోవడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. లక్ష్మీ కిరణ్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: మానవత్వం పరిమళించే విధంగా ఓ యువకుడు తన స్నేహితులతో కలిసి వరద బాధితులకు మంగళవారం చికెన్ బిర్యానీ ప్యాకెట్లు సరఫరా చేశారు. స్థానిక సంతపేటకు చెందిన మజ్జి బాలకృష్ణ అతని స్నేహితుల సహకారంతో సుమారు 200 మంది వరద బాధితులకు చికెన్ బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. తెల్లవారుజామునే చికెన్ బిర్యానీని తయారు చేసి, ప్యాకెట్లు చేసి, మజ్జిగ, కర్రీ ప్యాకెట్లును వ్యానులో వేసుకుని, స్నేహితులతో కలిసి విజయవాడ వెళ్లి వరద బాధితులకు అందజేశారు. అలాగే స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో 6 వేల భోజనం ప్యాకెట్లను వరద బాధితులకు సరఫరా చేశారు.



వంట తయారీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



విజయవాడకు వ్యాన్‌లో ఆహార ప్యాకెట్లను పంపిస్తున్న తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది

వరద బాధితులకు ఆహారం అందజేత

భీమవరం: విజయవాడ వరద బాధితులకు సహాయంగా భీమవరం శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం సరఫరా చేస్తున్నారు. దీనిలో భాగంగా కళాశాల విద్యార్థులు స్వయంగా కళాశాలలోనే రొట్టెలు, రస్కులు తయారు చేస్తున్నారు. వరద బాధితులకు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, బీవీ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 5 వేల ఆహార పొట్లాలు, 10,800 రస్కుల ప్యాకెట్లు, 4,500 బన్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. రస్కులు, బన్‌లను విద్యార్థులే స్వయంగా ప్యాకింగ్ చేశారు. కార్యక్రమంలో విష్ణు విద్యాసంస్థల డైరెక్టర్లు జె.ప్రసాదరాజు, పి.శ్రీనివాసరాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.రమేష్ రాజు పాల్గొన్నారు.



భీమవరం విష్ణు కళాశాలలో బన్‌లను ప్యాకింగ్ చేస్తున్న విద్యార్థులు

పొలాల్లో ముంపు నీటిని బయటకు తోడాలి

ఆకివీడు: భారీ వర్షాలకు, వరదలకు వరి చేలలో ఉన్న ముంపునీటిని బయటకు పంపించే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని దుంపగడప, అయిభీమవరం గ్రామాల్లో ముంపు నీటిలో ఉన్న వరి పొలాల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎగువ ప్రాంతం నుంచి ముంపు నీరు మరింతగా వచ్చే అవకాశం ఉందన్నారు. డ్రెయినేజీలలో ఉన్న అడ్డంకులను తొలగించి పంటను రక్షించుకునే ప్రయత్నాలు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లోనూ, మెరక ప్రాంతాల్లో కూడా వరి చేలు ముంపునకు గురయ్యాయని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టాయని, అయితే ఎగువ ప్రాంతంలోని బుడమేరు, ఇతర కాలువలు పొంగి ప్రవహించడంతో దిగువనున్న ఆయుకట్టుకు ముంపు బెడద ఉందన్నారు. ముంపు నీరు తొలగిన తరువాత రైతులు ఎరువుల వాడకంపై వ్యవసాయాధికారుల సూచనల్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక, ఎంపీడీఓ వాణి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పాలకోడేరు మండలం మోగల్లు, గరగపర్రు గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురైన వరి చేలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సూర్యకృష్ణ, బీఎల్ స్వరూపరత్నం పాల్గొన్నారు



ఆకివీడు మండలంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



మోగల్లులో రైతులతో మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్

ముంపునకు గురైన పొలాల పరిశీలన

వీరవాసరం: మండలంలోని బాలేపల్లి, మెంటేపూడి,దూసనపూడి గ్రామాలలో అధిక వర్షం కారణంగా ముంపునకు గురైన వరి పొలాలను భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు, చింతల శ్రీనివాస్, స్థానిక మండల వ్యవసాయ అధికారి, బిన్నీ బాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.